క్లుప్తంగా

ముగిసిన కార్తీక్ అంత్యక్రియలు



కార్తీక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: భద్రాచలం వద్ద గోదావరి నదిలో శనివారం నీట మునిగి మృత్యువాత పడ్డ అంగుళూరి కార్తీక్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు కార్తీక్ మృతదేహాన్ని ఏలూరులో మాదేపల్లి రోడ్డు ఇందిరా కాలనీలో పెద్దమ్మ ఇంటికి తీసుకొచ్చారు. కార్తీక్ 7వ తరగతి చదువుకుంటున్న మాదేపల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు, తోటి విద్యార్థులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆడుతూ, పాడుతూ చలాకీగా ఉండే కార్తీక్ అకాలంగా మృత్యువాత పడడంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

40 షెడ్ల నిర్మాణం పూర్తి



రామారావుగూడెంలో నిర్మించిన మల్బరీ షెడ్డు

దెందులూరు: దెందులూరు మండలంలో 40 మల్బరీ షెడ్ల నిర్మాణం పూర్తయ్యాయని పట్టు పరిశ్రమల శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టి.రత్తయ్య అన్నారు. ఆదివారం రామారావుగూడెంలో నిర్మాణం పూర్తయిన సాగులో ఉన్న మల్బరీ షెడ్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నూరు శాతం సబ్సిడీతో మల్బరీ సాగుకు ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం బాధాకరం

దెందులూరు: తాడేపల్లిలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని హైకోర్టు ప్రొసిడింగ్స్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తెల్లవారుజామున జేసీబీలతో కూల్చివేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, దెందులూరు నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు గడవక ముందే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రజలందరూ కూటమి ప్రభుత్వ చేష్టలను పరిశీలిస్తున్నారన్నారు. కుట్రపూరిత రాజకీయాలు తగదని కనకదుర్గమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కె.గణపతిరావు అన్నారు.

విడిది కేంద్రంలో విహంగాల సవ్వడి

- ఏలూరు సమీపంలోని మాధవాపురంలో పక్షుల విడిది కేంద్రం
- ఆకట్టుకుంటున్న మౌలిక వసతులు
- పెరుగుతున్న సందర్శకుల సంఖ్య



మాధవాపురం వద్ద కొల్లేరు పక్షుల విడిది కేంద్రం ముఖద్వారం



మాధవాపురం విడిది కేంద్రంలో గూడు కట్టుకుంటున్న పక్షులు (ఫైల్)



కొల్లేరులో విహరిస్తున్న కొంగలు

ఏలూరు రూరల్ : పక్షుల కిలకిల రాగాలు మనస్సును ఎంతో పులకింప జేస్తుంది. విహంగాల సవ్వడులు చూసి తన్మయత్వం చెందని వారుండరు. అవి పర్యావరణానికి ఎంతో మేలు చేయడంతోపాటు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తాయి. ఏలూరు నగర వాసులను స్థానికంగా ఏర్పాటు చేసిన కొల్లేరులో పక్షుల విడిది కేంద్రం ఆకట్టుకుంటోంది. నగరానికి 15 కిలోమీటర్ల దూరం మాధవాపురం వద్ద అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన పక్షుల విడిది కేంద్రం సెలవు రోజుల్లో పర్యాటకులతో కిటకిటలాడుతోంది. పాఠశాల, ప్రభుత్వ కార్యాలయం సెలవు దినాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు. వర్షాకాలం రావడంతో పక్షుల రాకతో కొల్లేరు ప్రాంతం సుందరంగా మారింది. ఫలితంగా ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి బాలబాలికలు, యువతీ, యువకులు కొల్లేరు సందర్శిస్తున్నారు.



కొల్లేరు ప్రజలకు తాగునీరు అందించే రిజర్వాయర్



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు



కొల్లేరు రిసార్ట్ వద్ద పిల్లల ఆట విడుపు

పక్షుల కిలకిల రాగాలు

కేంద్రం వద్ద పర్యాటకులు పక్షులను తిలకించేందుకు అటవీశాఖ అధికారులు వాచ్ టవర్ ఏర్పాటు చేశారు. వివిధ రకాల పక్షుల జీవన శైలి తెలుసుకునేలా బోర్డులు అందుబాటులో ఉంచారు. పర్యాటకులు సేద తీరేందుకు హట్స్ ఏర్పాటు చేశారు. మరుగుదొడ్డి, తాగునీరు తదితర మౌలిక వసతులు అభివృద్ధి చేశారు.

● చిన్నారులను ఆకర్షిస్తున్న ఆట స్థలాలు

పిల్లల కోసం ఆట స్థలాలను అభివృద్ధి చేశారు. ఇక్కడికి వచ్చిన పిల్లలు ఆటలతో సేద తీరుతున్నారు.

● బైనాక్యులర్లు ఏర్పాటు చేయాలి : పక్షులను మరింత దగ్గరగా తీక్షించేందుకు అధికారులు బైనాక్యులర్లు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

● రిసార్ట్ నిర్మాణం

ప్రభుత్వం ఇక్కడ పర్యాటకుల కోసం రిసార్ట్స్ నిర్మించింది. ఇందులో భోజనంతో పాటు కొల్లేరుకు చెందిన పలు రకాలు చేపల వంటకాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

● ఆకట్టుకుంటున్న ఆధ్యాత్మిక నిర్మాణాలు

గుడివాకలంకలో కనకదుర్గ ఆలయం, రామాలయాన్ని సందర్శకులు దర్శిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన కోటి రూపాయలతో నిర్మించిన చర్చి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. మొండికోడులో విశాలమైన రిజర్వాయర్‌ను పెద్దలు సందర్శిస్తున్నారు. ప్రత్తికోళ్లలంకలో 100 అడుగుల భారీ ఆంజనేయ విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. స్థానికంగా అభివృద్ధి చేసిన కొల్లేరు మల్లన్న ఆలయం చూసి తీరాల్సిందే. ఇక్కడ పరిసర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

యోగా సాధనతో మానసిక, శారీరక దృఢత్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి వ్యక్తి యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. నగరానికి చెందిన ఫ్లాష్ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జయహో యోగా కార్యక్రమాన్ని చంటి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ తాను తెల్లవారుజామున ఐదు గంటల నుంచి కనీసం అర గంట యోగా, వ్యాయామం చేస్తానని తెలిపారు. యోగా సాధన వల్ల మానసిక, శారీరక దృఢత్వం మెరుగుపడుతుందన్నారు. యోగా, ధ్యాన సాదన జ్ఞాపక శక్తిని మరింతగా పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లాష్ టీమ్ ప్రతినిధి శ్రీనివాస్, కొమ్మ నాగరాజు, ఎస్‌కే సత్తార్, జంపా సూర్యనారాయణ రావు, గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు.

5.20 లక్షల మందికి ఉపాధి పనులు



ఏపీఓ రామ్‌జీ

దెందులూరు: దెందులూరుమండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో 5.20 లక్షల మందికి ఉపాధి పని కల్పిస్తామని దెందులూరు మండల ఏపీఓ దశరద రామ్‌జీ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన కార్యాలయంలో మాట్లా డుతూ చెరువుల్లో మట్టి తీయడం, గట్లు పటిష్ట పరచడం, సప్లయ్ ఛానల్స్ ఏర్పాటు తదితర పనులు ఉపాధి కూలీలు చేస్తున్నారన్నారు. సకాలంలో వేతనాలు ఆన్‌లైన్ విధానంలో వారి ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు.

సక్షమ్ సేవలు అభినందనీయం



సక్షమ్ స్థాపన దినోత్సవంలో భాగంగా ప్రసంగిస్తున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న సక్షమ్ సేవలు అభినందనీయమని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలులో సక్షమ్ సంస్థ ధ్వర్యంలో ఆదివారం సక్షమ్ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ సకలాంగులతో సమానంగా అన్నింటినీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. అలాంటి దివ్యాంగులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్న సక్షమ్ సేవలను కొనియాడారు. దివ్యాంగులకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకుంటున్నాయన్నారు. వికలాంగత్వం శారీరానికేనని, మనస్సు కాదన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. దివ్యాంగులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. నేటి సమాజంలో ప్రజలు వికలాంగుల పట్ల ప్రేమానురాగాలు చూపుతున్నారన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆదుకుంటున్న, సేవలందిస్తున్న సక్షమ్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, సక్షం రాష్ట్ర సభ్యుడు సీహెచ్ జగన్నాథం, లయన్స్ క్లబ్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు పీవీ సత్యనారాయణ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

టెకు బ్యాంక్ సభ్యులకు 10 శాతం డివిడెండ్



టెకు బాక్ మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ (టెకు) నికర లాభంలో సభ్యులకు 10 శాతం డివిడెండ్‌ను ఇస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన టెకు బ్యాంక్ మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంక్ వ్యాపారం డిపాజిట్ల రూపంలో రూ.121.49 కోట్ల నుంచి 6.46 శాతం పెరిగి రూ.129.34 కోట్లకు చేరుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంక్ ద్వారా వివిధ రంగాలకు ఇచ్చే రుణాలను రూ. 88.50 కోట్ల నుంచి రూ. 91.45 కోట్లకు పెంచామన్నారు. మొత్తం బ్యాంక్ వ్యాపారం రూ. 220.79 కోట్లకు చేరుకుందన్నారు. ఇందులో రూ.74,09,215 నికర లాభం వచ్చిందన్నారు. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంక్ ద్వారా రూ. 259 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. బ్యాంక్ సీఈఓగా పని చేస్తున్న ఎం. అచ్యుతరావు పదవీ విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచడానికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఈ మహాజన సభలో ఆమోదించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లెక్కలను ఆడిట్ చేయడానికి చార్టర్డ్ అక్కౌంటెంట్‌ను ఆడిటర్‌గా నియమించడానికి రిజర్వ్ బ్యాంక్ అనుమతికి పంపడానికి సభ ఆమోదించింది. ఈ సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు పటగర్ల నాగభూషణరావు, వక్కలగడ్డ మారుతి వరప్రసాద్, కారంశెట్టి రమేష్ బాబు, చందూరు ఆంజనేయ స్వామి, షేక్ సాబీర్ హుస్సేన్, కేఆర్‌ఎస్‌ఎస్‌వీడీ సోమేశ్వరరావు, బంగారు వెంకట రామారావు, ప్రొఫెషనల్ డైరెక్టర్ దేవులపల్లి శ్రీరామ్ తదితరులు పాల్గొనగా, బ్యాంక్ సీఈఓ ఎం.అచ్యుతరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషి చేద్దాం



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరాభివృద్ధే లక్ష్యంగా జనంతో మమేకమవుతూ పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేసినప్పుడే ప్రజాహృదయాల్లో శాశ్వత స్థానం పొందవచ్చునని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పేర్కొన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వానికి పూర్తి సహకారమందిస్తే ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తానని ఆయన అన్నారు. ఆదివారం కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బడేటి చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే బడేటి చంటి హయాంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, దానిలో తాము కూడా భాగస్వాములు కావాలన్న ఏకై క లక్ష్యంతో ఏలూరు కార్పొరేషన్‌లోని పాలకవర్గం ఒక అడుగు ముందుకు వేసి స్నేహహస్తం అందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తనను అభినందించేందుకు వచ్చిన కార్పొరేషన్ పాలకవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు మాట్లాడుతూ ఏలూరు నగరాభివృద్ధికి ఎమ్మెల్యే బడేటి చంటికి సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

గ్రంథాలయాలతో విజ్ఞానం వృద్ధి

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయాల్లో చేపట్టిన చదవడం మాకిష్టం అనే కార్యక్రమంతో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని పెదవేగి శాఖా గ్రంథాలయాధికారి తోట అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పెదవేగి సమీప ప్రాంతాల నుంచి గ్రంథాలయానికివిచ్చేసిన విద్యార్థులకు అరుణ్‌కుమార్ వివిధ రకాల విజ్ఞాన భరిత పుస్తకాలను ఇచ్చి చదివించారు. చరిత్రలో విజయాలు సాధించిన ప్రముఖుల జీవిత చరిత్రలను చిన్నారులకు వివరించి, వారిలో నూతనోత్సాహాన్నినింపారు.

బీజేపీ కార్యాలయంలో బలిదాన్ దివస్



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పూర్వ జన సంఘ్ వ్యవస్థాపకుడు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు కుదరదని ప్రకటించడంతోపాటు, కాశ్మీర్ కోసం పోరాటం చేసిన యోధుడని అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం తన ప్రాణాన్ని బలిదానం చేశారన్నారు. తొలుత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్నేని కృష్ణ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు, ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగం శివ, చేకూరి గణపతి, బర్మా లక్ష్మణరావు, జీ. సర్వేశ్వరరావు, ఎం. శ్రీనివాస్, ఏ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నూతన అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, జిల్లా శాంతి రథాల కమిటి చైర్మన్ అప్పక రాంబాబు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సూరప్పగూడెంకు చెందిన విద్యార్థి బలుసు రుక్మిణి శ్రీ దుర్గాపావనికి రూ.5వేలకు ఫీజు నిమిత్తం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన పూళ్లకు చెందిన పులి లక్ష్మీ గాయత్రికి రూ.2వేలు, ద్వితీయ స్థానం పొందిన జీబీఎస్ఎస్ రాజేశ్వరికి రూ.1,500, తృతీయ స్థానం పొందిన గుండుగొలనుకు చెందిన జస్వంత్‌కు రూ.1,000 చొప్పున నగదును అందించారు. అనంతరం మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శిగా అల్లాడ ప్రసాదరావు, కోశాధికారిగా గోనుగుంట రమణశంకర్, ఉపాధ్యక్షుడిగా అడబాల శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శి పున్నం గోపి, ఈసీ సభ్యులు సీహెచ్ రాజేష్, బంటు గణేష్, చిలపర్తి ఆదినారాయణ, రామిశుట్టి రామన్నలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణ, విద్యా కమిటీ డైరెక్టర్ దవులూరి ప్రభాకరరావు, జిల్లా ప్రతినిధి రామిశెట్టి గంగాధరరావు, పూర్వపు మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పులిచర్ల వెంకట కృష్ణారావు, గోనుగుంట రమణ, గంధం వెంకట్రావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	64-68	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07, 10
బెండకాయలు	54	కంద	64
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	40
కాకర కాయలు	48-64	కీరా దోస	46
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	60	అల్లం	180
క్యాబేజీ	42	కొత్తిమీర (కట్ట)	20-40
క్యారెట్	40-56	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	10
ఉల్లిపాయలు	38-40	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58

జేసీ ఆదేశాలను అమలు చేయాలి



కోర్టు జడ్జిమెంట్ కాపీలు ప్రదర్శిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దోసపాడు పేదల ఇళ్ల కోసం జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను రెవెన్యూ అధికారులు వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. దోసపాడు పేదలకు అనుకూలంగా కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అన్నే భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోసపాడు పేదలు, దళితుల అసైన్మెంట్ భూములను అసలైన అసైన్మెంట్‌దారులకు పంచాలని జేసీ కోర్టు ఆదేశాలు విడుదల చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 2016 నుంచి గౌరవ లోకాయుక్త ఇచ్చిన తీర్పు ఆధారంగా దోసపాడు పేదలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారని తెలిపారు. భూస్వాములు ఇచ్చిన లంచాలు మింగిన అధికారులు పేదలకు అన్యాయం చేయాలని చూశారన్నారు. దోసపాడు పేదలు, దళితులు పట్టు విడవకుండా వ్యవసాయ కార్మిక సంఘం అండతో పెద్ద ఎత్తున పోరాటాలు చేవారని తెలిపారు. లోకాయుక్త తీర్పు మాదిరిగానే జేసీ తీర్పును కూడా రెవెన్యూ శాఖ అధికారులు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి జేసీ కోర్టు ఇచ్చిన జడ్జిమెంటును అమలు చేసి ఎసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులు చేసిన తప్పిదాలకు ఎనిమిదేళ్ల నుంచి దోసపాడు పేదలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. దోసపాడు పేదలపై అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురి చేయటంతో పాటు గ్రామాల్లో 144,145 సెక్షన్ విధించి పేదలకు నిద్రాహారాలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పీ.ఆనందరావు, డీ.నాగేంద్ర పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



పోతునూరు ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దెందులూరు: స్నేహానికి ఉన్న విలువ, సృష్టిలో మరి దేనికీ లేదని రిటైర్డ్ ఎమ్మెల్వో, పోతునూరు పాఠశాల ఉపాధ్యాయులు గద్దె అమరేశ్వరరావు అన్నారు. ఆదివారం పోతునూరు ఉన్నత పాఠశాలలో పోతునూరు ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. తొలుత పూర్వ విద్యార్థులు సున్నా లక్ష్మణ్‌బాబు, ఏ. నాగేశ్వరరావు, నాగనబోయిన శంకరరావు, అప్పారావు, రామారావు పాఠశాల ఉపాధ్యాయులను వేదికపైకి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు ఒక్కొరు వచ్చి వారు ఏ రంగంలో స్థిరపడింది, కుటుంబ నేపథ్యం వివరించి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా మాట్లాడుతూ తమకు విద్యనేర్పిన పాఠశాలకు త్వరలో తమ వంతు సాయం అందిస్తామని వివరించారు. వారంతా బాల్య స్మృతులను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు గద్దె అమరేశ్వరరావు, ఎస్.రాజారమేష్, బెజవాడ శివకుమారి, సీహెచ్ రామ్‌కుమార్‌ను విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగనబోయిన శంకరరావు, అటవీ శాఖ ఉద్యోగి అప్పారావు, విద్యుత్ శాఖ ఉద్యోగి రామారావును సహచర విద్యార్థులు అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.